GSTIN-NO:36FKPSI308PIZX
epaper:tmedia.net.in

టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్

సంపుటి : 7 | సంచిక : 99 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | సోమవారం 16-12-2024 | పేజీలు : 3

ఎన్నికల కోసం ఆప్ తుది జాబితా..

న్యూఢిల్లీ నుంచి అరవింద్ కేజ్రీవాల్

టీ మీడియా, డిసెంబర్ 15,న్యూఢిల్లీ:

దేశ రాజధాని ఢిల్లీలో అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల కోసం నాలుగో జాబితా విడుదల చేసింది. తుది జాబితాలో 38 మంది అభ్యర్థులను ఆ పార్టీ ప్రకటించింది. ఆప్ చీఫ్, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్న న్యూఢిల్లీ సీటు నుంచి అలాగే కల్కాజీ నుంచి సీఎం అతిషి పోటీ చేయనున్నారు. గ్రేటర్ కైలాష్ నుంచి మంత్రి సౌరభ్ భరద్వాజ్, బాబర్‌పూర్ నుంచి గోపాల్ రాయ్ బరిలోకి దిగుతున్నారు. శకుర్ బస్తీ నుంచి సత్యేంద్ర కుమార్ జైన్, రాజిందర్ నగర్ నుంచి దుర్గేష్ పాఠక్ పోటీ చేయనున్నారు.కాగా, తుది జాబితా ప్రకటనతో ఢిల్లీ అసెంబ్లీలోని మొత్తం 70 స్థానాలకు అభ్యర్థులను ఆప్ ఖరారు చేసింది. తమ పార్టీ పూర్తి విశ్వాసంతో, సన్నాహాలతో ఈ ఎన్నికల్లో పోటీ చేస్తుందని అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. 'బీజేపీ కనిపించదు. సీఎం ఫేస్ వ్యక్తి, బృందం, ప్రణాళిక, ఢిల్లీపై దృష్టి వారికి లేదు. వారికి ఒకే ఒక్క నినాదం ఉంది. 'కేజ్రీవాల్‌ను తొలగించండి'. ఈ ఐదేళ్లలో ఏమి చేశారో వారిని అడగండి. 'కేజ్రీవాల్‌ను మేం దుర్భాషలాడాం' అని చెబుతారు' అని విమర్శించారు.మరోవైపు ఢిల్లీ మద్యం పాలసీ కేసులో అరెస్టై బెయిల్‌పై విడుదలైన అరవింద్ కేజ్రీవాల్ సీఎం పదవికి రాజీనామా చేశారు. 2025 ఫిబ్రవరిలో జరుగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో 'ప్రజాకోర్టు' తీర్పు తర్వాత మాత్రమే తిరిగి ఆ పదవి చేపడతానని అన్నారు. అలాగే కాంగ్రెస్‌తో ముందస్తు ఎన్నికల పొత్తుకు అవకాశం లేదని తేల్చిచెప్పారు. సొంత బలంతోనే తమ పార్టీ ఎన్నికల్లో పోటీ చేస్తుందని స్పష్టం చేశారు.

బీఆర్ఎస్ సర్కారు
రైతులను పట్టించుకోలేదు

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- రైతుల కోసం 50,953 కోట్లు ఖర్చు
- నాలుగు కొత్త విమానాశ్రయాలు

టీ మీడియా, డిసెంబర్ 15, ఖమ్మం బ్యూరో:

బీఆర్ఎస్‌పై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విమర్శలు గుప్పించారు. ఆయన ఖమ్మంలో మీడియాతో మాట్లాడుతూ.. "10 ఏళ్లలో బీఆర్ఎస్ పార్టీ పంట నష్టపోయిన రైతులను పట్టించుకోలేదు. రైతుల పట్ల ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో పని చేస్తుంది. భూమి లేని నిరుపేదల గురించి కూడా ప్రభుత్వం ఆలోచిస్తుంది, దానికి ప్రభుత్వం వెనకడుగు వేయడం లేదు.డిసెంబర్ 28వ తేదీన మొదటి ఇన్‌స్టాల్‌మెంట్ ఇస్తుంది. రైతుల పక్షాన, వ్యవసాయ పక్షాన కాంగ్రెస్ పార్టీ నిలబడుతుంది. సీఎం పైన, ప్రభుత్వం పైన తప్పుడు కథనాలు ప్రచురిస్తే నమ్మేందుకు ప్రజలు సిద్ధంగా లేరు. ప్రతి పక్ష పార్టీ వాస్తవాలను అవాస్తవాలుగా చూపించే ప్రయత్నం చేస్తుంది" అని భట్టి విక్రమార్క అన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం నడిపిస్తున్న అన్ని స్కూళ్లలో డైట్, కాస్మొటిక్ చార్జెస్ పెంచామని భట్టి విక్రమార్క అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తాను, మంత్రులు, రాష్ట్రంలోని ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు అందరం కలిసి అన్ని పాఠశాలలో కూర్చుని భోజనం చేశామని అన్నారు. మంచి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని పిల్లలకు అందించామని చెప్పారు.నూతనంగా పెంచిన డైట్ చార్జీల కారణంగా రాష్ట్ర ప్రభుత్వం మీద కొంత భారం పడుతుందని తెలిపారు. సంవత్సరానికి 541 కోట్ల భారం రాష్ట్ర ప్రభుత్వం పై పడుతుందని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ తప్పుడు సమాచారంతో ప్రజలను తప్పు దోవ పట్టించే ప్రయత్నం చేస్తుందని తెలిపారు.

రాష్ట్ర ఆర్థిక, అప్పుల పరిస్థితిపై ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా తప్పుడు ప్రచారం చేస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఫైర్ అయ్యారు. ఆదివారం ఖమ్మం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 10 సంవత్సరాల కాలంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా గత బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన 7,11,911 కోట్ల రూపాయల అప్పులకు సంబంధించి తమ దగ్గర పక్కా లెక్కలు ఉన్నాయని తెలిపారు. నేడు తాము అప్పులు చేసినట్లుగా ఆ పార్టీ ప్రచారం చేయడం సరికాదని అన్నారు. బీఆర్ఎస్ సర్కార్ తినడానికి అప్పులు చేస్తే.. వారు చేసిన అప్పులకు వడ్డీలు కట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అప్పులు చేసిందని క్లారిటీ ఇచ్చారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రూ.54, 118 కోట్లు అప్పులు చేయగా గత బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులు, వడ్డీలకు మొత్తం 66,782 కోట్ల రూపాయలు బ్యాంకులకు కట్టామన్నారు. అసెంబ్లీ లో ఎవరు ఎన్ని అప్పులు చేశారో చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 2014 నాటికి రాష్ట్ర ప్రభుత్వం నేరుగా తీసుకున్న అప్పులు 72,658 కోట్లు రూపాయలు ఉండగా, 2024 నాటికి 3,89,673 కోట్ల రూపాయలు గత బిఆర్ఎస్ ప్రభుత్వం అప్పులు చేసిందని వివరించారు. కార్పొరేషన్ల పేరిట ప్రభుత్వం గ్యారెంటీ ఇచ్చి తీసుకున్న అప్పులు 2014 నాటికి 5,893 కోట్ల రూపాయలు ఉండగా, 2024 నాటికి 95,462 కోట్లు, ప్రభుత్వ గ్యారెంటీ లేకుండా వివిధ కార్పొరేషన్లు నేరుగా చేసిన అప్పులు 2014 నాటికి ఏమీ లేకపోగా, 2024 నాటికి 59,414 కోట్లు రూపాయలు అప్పు గత పాలకులు చేశారన్నారు. ఇవే కాకుండా గత 10 సంవత్సరాలు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పాలకులు ఇరిగేషన్, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, హాస్పిటల్, ఉద్యోగుల జిపిఎఫ్, మిడ్ డే మీల్స్, ఫీజు రియంబర్స్మెంట్ తదితర వాటికి అప్పుగా పెట్టినవి 40,154 కోట్ల రూపాయలు ఉన్నాయని, వీటన్నిటిని కలిపితే మొత్తం రూ.7,11,911 కోట్ల అప్పుల భారాన్ని గత బిఆర్ఎస్ పాలకులు ప్రజలపై మోపి తగుదునమ్మ అంటూ కేటీఆర్, హరీష్ రావులు ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా రాష్ట్ర అప్పుల గురించి పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన అప్పులకు బ్యాంకులకు 2014 నాటికి సంవత్సరానికి రూ.6400 కోట్ల రూపాయలు మాత్రమే చెల్లించగా, గత 10 సంవత్సరాల్లో బీఆర్ఎస్ చేసిన అప్పుల వల్ల అప్పులు ,వడ్డీలు కట్టడానికి 66,782 కోట్ల రూపాయలు చెల్లించే దుస్థితికి ఈ రాష్ట్రాన్ని తీసుకెళ్లి గాయి, గాయిగా అరవడం దేనికని నిలదీశారు. టిఆర్ఎస్ నాయకులకు గాలి మాటలు చెప్పడం, లేనిది ఉన్నట్టు ఉన్నది లేనట్టు భ్రమలు కల్పించి ప్రజలను మోసం చేయడం బాగా తెలుసని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే గత బిఆర్ఎస్ పాలకులు చేసిన ఆర్థిక విధ్వంసం అప్పుల గురించి శ్వేత పత్రం అసెంబ్లీలో విడుదల చేసి ప్రజలకు వాస్తవాలు చెప్పామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేనప్పటికీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారంగా కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారంటీలను అమలు చేస్తున్నదని వివరించారు. భూమిలేని నిరుపేద కుటుంబాలకు ఏడాదికి రెండు విడతల్లో 12 వేల రూపాయలు ఆర్థిక సాయం చేస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ చేసిన వాగ్దానాన్ని ఈనెల 28న అమలు చేయబోతున్నామన్నారు. దేశ స్వాతంత్రం కోసం ఏర్పడిన అఖిల భారత కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం రోజు డిసెంబర్ 28న రాష్ట్రంలోని నిరుపేద కూలీల కుటుంబాలకు మొదటి విడతగా 6 వేల రూపాయలను ప్రజా ప్రభుత్వం చెల్లిస్తుందని ప్రకటించారు. అదేవిధంగా రైతు భరోసా చెల్లించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన విధంగా వచ్చే సంక్రాంతి నుంచి రైతులకు రైతుబంధు డబ్బులు ఇస్తామని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా రెండు లక్షల రుణాలు ఉన్న రైతులందరికీ కేవలం 15 రోజుల్లోనే వారి ఖాతాల్లో నేరుగా 21 వేల కోట్ల రూపాయలను జమ చేసి దేశానికి ఆదర్శంగా తెలంగాణ ప్రభుత్వం నిలిచిందన్నారు.

రైతుల కోసం 50,953 కోట్లు ఖర్చు

ప్రజా ప్రభుత్వ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు వ్యవసాయానికి, రైతుల కోసం నేరుగా 50,953 కోట్ల రూపాయలు ఖర్చు చేసిందని వివరించారు. రైతు భరోసా కు 7625 కోట్లు, రైతు రుణమాఫీకి 21 వేల కోట్ల రూపాయలు, రైతు బీమా ప్రీమియం చెల్లింపుకు 1514 కోట్ల రూపాయలు, ఫర్ డ్రాప్ మోర్ క్రాప్ కొరకు 40 కోట్ల రూపాయలు రైతులకు విత్తనాల సరఫరా నిమిత్తం 36 కోట్ల రూపాయలు, వ్యవసాయ పంపుసెట్లకు ఇస్తున్న సబ్సిడీకి 11,270 కోట్ల రూపాయలు, వ్యవసాయానికి కావలసిన సాగునీరు (ఇరిగేషన్) పనుల కోసం 9,795 కోట్లు, మొత్తం 50, 953 కోట్ల రూపాయలను ఖర్చు చేసి నిబద్ధత చాటుకున్నది కాంగ్రెస్ ప్రభుత్వమని పేర్కొన్నారు. అదేవిధంగా గత ప్రభుత్వం పంట నష్టపరిహారాన్ని పూర్తిగా విస్మరించగా ప్రజా ప్రభుత్వం ఎకరాకు పదివేల రూపాయలు చెల్లించిందని వెల్లడించారు.బిఆర్ఎస్ కట్టామని చెప్పుకుంటున్న కాళేశ్వరం ప్రాజెక్టుతో సంబంధం లేకుండా గత కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్మాణం చేసిన ప్రాజెక్టుల నుంచి పారిన నీళ్లతో పండిన ప్రతి గింజను ప్రజా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం డబ్బులను వారం రోజుల్లో రైతులకు చెల్లిస్తున్నామని చెప్పారు. సన్న ఓట్లకు క్వింటాకు 500 బోనస్ చెల్లిస్తున్నామని తెలిపారు. సన్న వడ్లపై క్వింటాకు ఇస్తున్న 500 బోనస్ ద్వారా ప్రతి ఎకరాకు పది నుంచి పదిహేను వేల రూపాయలను అదనంగా రైతులు లబ్ధి పొందుతున్నారని వెల్లడించారు. 1.20 లక్షల కోట్ల రూపాయలతో గొప్పగా, అద్భుతంగా కాళేశ్వరం కట్టామని బిఆర్ఎస్ నాయకులు చెప్పారని, కానీ కాళేశ్వరం తో సంబంధం లేకుండా ఈ ఏడాది వారి ఉత్పత్తి గణనీయంగా పెరిగిందన్నారు.

నాలుగు కొత్త విమానాశ్రయాలు

రాష్ట్రవ్యాప్తంగా పరిశ్రమల విస్తరణ కోసం ప్రజా ప్రభుత్వం కొత్తగూడెం రామగుండం ఆదిలాబాద్ వరంగల్ ప్రాంతాల్లో విమానాశ్రయాలను ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని అందులో భాగంగా హైదరాబాద్ నగరంలో ఫ్యూచర్ సిటీని నిర్మాణం చేస్తున్నామన్నారు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన స్పోర్ట్స్ యూనివర్సిటీ స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరం గుండా 55 కిలోమీటర్ల మేర ప్రవహిస్తున్న మోసిని ప్రక్షాళన చేసి పునర్జీవం తీసుకువచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నదని వెల్లడించారు. అన్ని జిల్లాలను కలుపుతూ రీజినల్ రింగ్ రోడ్ ఏర్పాటు చేస్తాం. ఔటర్ రింగ్ రోడ్ రీజినల్ రింగ్ రోడ్ మధ్యన ఇండస్ట్రియల్, హౌసింగ్ క్లస్టర్లు ఏర్పాటు చేసి భవిష్యత్తు తరాలకు అందిస్తామన్నారు.

ఒకే దేశం-ఎన్నిక బిల్లుపై కేంద్రం పునరాలోచన..?

- పార్లమెంట్‌లో బిల్లు పెట్టేది అనుమానమే

టీ మీడియా, డిసెంబర్ 15,ఢిల్లీ :

ఒకే దేశం-ఒకే ఎన్నికకు సంబంధించిన బిల్లుపై కేంద్ర ప్రభుత్వం పునరాలోచనలో పడినట్లు తెలుస్తున్నది. వాస్తవానికి, సోమవారం పార్లమెంట్‌లో బిల్లులు ప్రవేశపెట్టనున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఈ క్రమంలో రాజ్యాంగం (129వ సవరణ) బిల్లు, కేంద్ర పాలిత ప్రాంత చట్టాల (సవరణ) బిల్లులను సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టేందుకు జాబితా చేసింది. తాజాగా సవరించిన లోక్‌సభ బిజినెస్ జాబితాలో సోమవారం నాటి ఎజెండాలో ఈ రెండు బిల్లులను తొలగించింది. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు డిసెంబర్ 20న ముగియనున్నారు. గురువారం కేబినెట్ రాజ్యాంగ (129వ సవరణ) బిల్లు- 2024, కేంద్రపాలిత ప్రాంతాల చట్టాలు (సవరణ బిల్లు), 2024కి ఆమోద ముద్ర వేసింది.ఆ తర్వాత శుక్రవారం సాయంత్రం బిల్లులకు సంబంధించిన ప్రతులను సభ్యులకు పంపిణీ పూర్తయ్యింది. ఈ క్రమంలో కేంద్రం బిల్లులను ప్రవేశపెడుతుందా? లేదా? అన్నది చర్చనీయాంశంగా మారింది. వాస్తవానికి జమిలీ ఎన్నికల కోసం రాజ్యాంగంలో కొత్తగా 82ఎ అధికరణను చేర్చాల్సి రానున్నది. పార్లమెంట్ పదవీకాలంలో మార్పు కోసం 83 అధికరణ, అసెంబ్లీ పదవీకాలం సవరణ కోసం 327 అధికరణను సవరించాల్సి ఉంటుంది. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని అత్యున్నత స్థాయి కమిటీ సిఫారసుల మేరకు రాజ్యాంగ (129వ సవరణ) బిల్లును కేంద్రం రూపొందించిన విషయం తెలిసిందే. ముసాయిదా బిల్లుల ప్రకారం సార్వత్రిక ఎన్నికల తర్వాత లోక్‌సభ మొదటి సమావేశానికి రాష్ట్రపతి నోటిఫై చేసిన తేదీ నుంచి ఏకకాల ఎన్నికలు అమలులోకి

వస్తాయి.రాజ్యాంగ సవరణ బిల్లు ప్రకారం.. ఈ నియమిత తేదీ తర్వాత ఎన్నికైన అన్ని రాష్ట్రాల అసెంబ్లీల పదవీ కాలాలు, లోక్‌సభ పూర్తికాల వ్యవధితో పాటు ముగిసేలా తగ్గిస్తారు. తద్వారా ఏకకాల ఎన్నికలకు మార్గం సుగమమవుతుంది. 2024 లోక్‌సభకు సంబంధించి మొదటి సమావేశం ముగిసిందున.. తదుపరి లోక్‌సభ ఎన్నికలు 2029లో జరుగుతాయి. ఆ లోక్‌సభ తొలి సమావేశంలో రాష్ట్రపతి నోటిఫై చేస్తే.. ఆ లోక్‌సభ పూర్తి పదవీ కాలం ఉంటే 2034లో తొలి విడత జమిలీ ఎన్నికలు జరుగుతాయి. బిల్లు ప్రకారం అసెంబ్లీలకు ఉన్న నిబంధనలు కేంద్ర పాలిత ప్రాంతాలైన ఢిల్లీ, జమ్మూ కశ్మీర్, పుదుచ్చేరికి వర్తిస్తాయి. కొత్త జమిలి ఎన్నికల బిల్లు ప్రకారం నిర్దేశిత కాల పరిమితి కన్నా ముందే పార్లమెంట్, రాష్ట్ర, యూటీల అసెంబ్లీలు రద్దయితే, ఆయా అసెంబ్లీలకు, పార్లమెంట్‌కు మిగిలి ఉన్న కాలానికి మాత్రమే మధ్యంతర ఎన్నికలు జరుగుతాయి.

సంకల్పం కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు

సీఎం చంద్రబాబు

టీ మీడియా, డిసెంబర్ 15, విజయవాడ :

సంకల్ప సిద్ధి కోసం ప్రాణత్యాగం చేసిన ఏకైక వ్యక్తి పొట్టి శ్రీరాములు అని, ప్రజలకు మంచి చేసే వ్యక్తులను, చెడు చేసే నాయకులను ఎప్పుడూ గుర్తించుకోవాలని ఏపీ సీఎం చంద్రబాబు రాష్ట్ర ప్రజలను కోరారు. గత వైసీపీ పాలనలో రాష్ట్రం తిరోగమనంలో పయనించిందని ఆరోపించారు. నేడు అమరజీవి పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినం సందర్భంగా తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొని మాట్లాడారు. పొట్టి శ్రీరాములు అమరజీవిగా ఖ్యాతి పొందారని, సంకల్ప సిద్ధి కోసం ప్రాణత్యాగం చేసిన ఏకైక వ్యక్తి పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ఆయన ఆత్మార్పణం భాషా ప్రయుక్త రాష్ట్రాల ఆవిర్భావానికి దోహదం చేసిందన్నారు. ఆయన ప్రాణ త్యాగం తర్వాత తెలుగు రాష్ట్రం ఏర్పడిందన్నారు. స్ఫూర్తినిచ్చిన నాయకులను గుర్తుపెట్టుకుంటూనే 2014-19లో టీడీపీ అందించిన పాలనను గుర్తించుకోవాలని సూచించారు. 2019-24వరకు ఉన్న వైసీపీ అన్ని రంగాలను నిర్వీర్యం చేయడంతో పాటు

టీడీపీ చేపట్టిన అభివృద్ధిని ప్రభుత్వం పక్కనపెట్టిందని విమర్శించారు. అమరావతిని, పోలవరాన్ని వైసీపీ నాశనం చేసిందని పేర్కొన్నారు. 2019లో వైఎస్ జగన్ ప్రజల నెత్తిన చెయ్యిపెట్టి, ఆస్తులే రాయించుకునే పరిస్థితి తీసుకొచ్చారని ఆరోపించారు. గత ఐదేళ్లు రాష్ట్ర ప్రజలు స్వేచ్ఛను కోల్పోయారని వెల్లడించారు. హెల్తీ, వెల్తీ, హ్యాపీ సమాజమే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. కేంద్రంలో ఏపీ పరపతి పెరిగింది కాబట్టి అప్పుడప్పుడు ఆర్థికంగా సహాయం చేస్తూ ఆక్సిజన్ అందిస్తున్నారని వివరించారు. ఆ సహాయం కూడా లేకపోతే అనేక ఇబ్బందులు వచ్చేవని అన్నారు. ఇంకా పేదవానికి ఏవిధంగా న్యాయం చేయాలనే ఆలోచన ప్రభుత్వానికి ఉందని అన్నారు. త్యాగాలు చేసిన నాయకులను చూసినప్పుడు ఇబ్బందులు అధిగమించడం కష్టం కాదని అన్నారు. దేశాన్ని ఐకమత్యంగా ఉంచడం కోసం పోరాడిన ఉక్కు మనిషి సర్దార్ వల్లభారు పటేల్, సంకల్ప సిద్ధి కోసం ప్రాణత్యాగం చేసిన ఏకైక వ్యక్తి పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

బాస్‌తో బన్నీ మీటింగ్..

ఈ అంశాలపై చర్చ

స్వయంగా కారు డ్రైవ్ చేస్తూ

టి మీడియా, డిసెంబర్ 15, హైదరాబాద్ బ్యూరో:

ఇది మెగా మీటింగ్.. బాస్‌తో బన్నీ మీటింగ్.. మెగాస్టార్ చిరంజీవిని ఆయన నివాసంలో కలిశారు అల్లు అర్జున్. స్వయంగా కారు డ్రైవ్ చేస్తూ కుటుంబ సమేతంగా చిరంజీవి ఇంటికి వెళ్లారు. సంధ్య థియేటర్ ఘటనలో శుక్రవారం అరెస్టైన బన్నీ శనివారం ఉదయం చంచల్‌గూడ జైలు నుంచి విడుదలయ్యారు. శనివారం రోజంతా టాలీవుడ్ ప్రముఖులు, రాజకీయ నేతల పరామర్శలతో బిజీగా ఉన్నారు. శనివారం మేనత్త సురేఖ వచ్చి అల్లు అర్జున్‌తో మాట్లాడారు. ధైర్యం చెప్పారు. ఇక ఆదివారం బన్నీయే మెగాస్టార్ ఇంటికి వెళ్లి.. మావయ్యని కలిసి తాజా పరిణామాలన్నింటిపైన మాట్లాడారు. అల్లు అర్జున్%%% చిరు నివాసంలో దాదాపు గంటసేపు గడిపి పలు అంశాలపై మాట్లాడినట్లు తెలిసింది.అరెస్ట్ అయినప్పటి నుంచి బన్నీకి మెగా ఫ్యామిలీ నుంచి సపోర్ట్ లభించింది. కేసు నమోదైన రోజే బన్నీకి మద్దతుగా నిలిచారు చిరంజీవి. అల్లు అర్జున్ అరెస్ట్ అయిన తర్వాత హుటాహుటిన బన్నీ ఇంటికి వచ్చి వివరాలు తెలుసుకున్నారు. తన షఉటింద్ రద్దు చేసుకుని.. అల్లు అరవింద్ సహా కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ ఎప్పటికప్పుడు ఏం జరుగుతుందో తెలుసుకున్నారు. చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌కు వెళ్లాలనుకున్నా పోలీసులు వద్దని సూచించడంతో ఆగిపోయారు. దీంతో కృతజ్ఞతగా ఆదివారం బన్నీ స్వయంగా మెగాస్టార్ ఇంటికి వెళ్లారు.కాగా పుష్ప-2 పాన్ ఇండియా స్థాయిలో సూపర్ హిట్ అవడంతో.. బన్నీకి శుభాకాంక్షలు తెలిపారు చిరు. అయితే బన్నీ వెళ్లిన సమయంలో చరణ్ ఉపాసన దంపతులు పనులు నిమిత్తం ఇంట్లో లేరని తెలిసింది.

కొంపముంచిన ఒక్క 'నిమిషం' నిబంధన

తొలిరోజే గ్రూప్ 2 పరీక్షకు పలువురు దూరం

టి మీడియా, డిసెంబర్ 15, ఆదిలాబాద్:

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 1,368 పరీక్ష కేంద్రాల్లో గ్రూప్ 2 పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. తొలి రోజు ఉదయం పేపర్ 1 పరీక్ష ప్రశాంతంగా జరిగినప్పటికీ.. ఒక్క నిమిషం నిబంధన కొందరు అభ్యర్థుల కొంప ముంచింది. పరీక్షకు సరిగ్గా అరగంట ముందే గేట్లు మూసివేస్తామని, ముగింపు సమయంలోగా అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని టీజీపీఎస్సీ అధికారులు ముందే హెచ్చరించారు. మధ్యాహ్నం పరీక్షకు 2.30 గంటల తరువాత గేట్లు మూసివేస్తామని చెప్పారు. దీంతో ఈ రోజు ఉదయం పేపర్ 1 పరీక్షకు 9.30 గంటలకే పరీక్ష కేంద్రాల వద్ద గేట్లు మూసివేశారు. ఉదయం 10 గంటలకు పరీక్ష ప్రారంభమైంది. అయితే కొన్ని చోట్ల ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులను అధికారులు పరీక్షకు అనుమతించలేదు. ముందే స్పష్టమైన ఆదేశాలిచ్చామని, తామేం చేయలేమని అధికారులు తేల్చిచెప్పడంతో ఆలస్యంగా వచ్చిన వారంతా కన్నీరు పెట్టుకున్నారు. ఒక్క ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే ఒక్క నిమిషం నిబంధన వల్ల ఏకంగా 16 మంది అభ్యర్థులు పరీక్షకు దూరమయ్యారు. ఆసిఫాబాద్ జిల్లాలో ముగ్గురు అభ్యర్థులు పరీక్షకు దూరమయ్యారు. అలాగే, మంచిర్యాల జిల్లాలో శ్రీహర్ష డిగ్రీ కాలేజీ పరీక్షా కేంద్రానికి ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినందుకు మరో ముగ్గురు అభ్యర్థులను పరీక్ష రాసేందుకు అనుమతించలేదు.

ఇక జనగామ జిల్లాలో మరో విచిత్ర సంఘటన చోటు

చేసుకుంది. ఓ మహిళ అరగంట ముందే పరీక్షకు హాజరైనా పరీక్ష రాసే అవకాశాన్ని కోల్పోయింది. ఓఎంఆర్ షీట్ బయోమెట్రిక్ సమయంలో అభ్యర్థి సెంటర్ మారినట్లు అధికారులు గుర్తించారు. ఆమె సెంటర్ కోడ్ ఇది కాదని అధికారులు చెప్పడంతో అసలు కేంద్రానికి పరుగున వెళ్లారు.నిజానికి జనగామలో పక్క పక్కనే రెండు పరీక్ష కేంద్రాలు ఉండడంతో పొరపాటున ఆమె మరో సెంటర్ కు వెళ్ళింది. అయితే సెంటర్ మారిందన్న సంగతి ఆమెకు ఇన్విజిలేటర్ ఓఎంఆర్ షీటు, బయోమెట్రిక్ ప్రక్రియ వేసే వరకు చెప్పలేదు. తీరా అభ్యర్థి సెంటర్ మారిందని గుర్తించే సమయానికే అరగంట వృధా అయ్యింది. ఆమె బాలింత కావడంతో బయటికి పరుగున వచ్చి.. పసిబిడ్డతో పక్కనే ఉన్న మరో పరీక్ష కేంద్రానికి వెళ్లగా అప్పటికే టైం దాటిపోయింది. దీంతో అక్కడి అధికారులు ఆమెను లోనికి అనుమతించలేదు. దీంతో ఆమె చేసేదిలేక కన్నీటి పర్యంతమయ్యారు.

దేవేంద్ర ఫడ్నవీస్ మంత్రివర్గ విస్తరణ..

39 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం

టీ మీడియా ,డిసెంబర్ 15, ముంబై:

మహారాష్ట్రలో తొలిసారిగా దేవేంద్ర ఫడ్నవీస్ మంత్రివర్గ విస్తరణ జరిగింది. ఇందులో రాష్ట్ర బీజేపీ చీఫ్ చంద్రశేఖర్ బవాన్‌కులే సహా మొత్తం 39 మంది మహాయుత నాయకులు మంత్రులుగా ప్రమాణం చేయించారు. నాగ్‌పూర్‌లోని రాజ్‌భవన్‌లో ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. మొత్తం 39 మంది ఎమ్మెల్యేలతో గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ప్రమాణం చేయించారు.మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ తన మంత్రివర్గాన్ని విస్తరించారు. నాగ్‌పూర్ రాజ్‌భవన్‌లో కొత్త మంత్రులు ప్రమాణం చేశారు. 39 మందికి ఫడ్నవీస్ కేబినెట్‌లో చోటు దక్కింది. శాఖల కేటాయింపుపై కూడా స్పష్టత వచ్చింది. కీలకమైన హోంశాఖ, రెవెన్యూ శాఖను బీజేపీకి కేటాయించారు. శివసేనకు ఆరోగ్యశాఖతో పాటు రవాణశాఖ దక్కనుంది. ఎన్సీపీకి ఆర్థికశాఖను కేటాయించారు. గవర్నర్ రాధాకృష్ణన్ కొత్త మంత్రులతో ప్రమాణం చేయించారు. ప్రమాణస్వీకార కార్యక్రమానికి షిండే , అజిత్ పవార్ హాజరయ్యారు. మంత్రివర్గణ విస్తరణకు ముందు సీఎం ఫడ్నవీస్ నాగ్‌పూర్‌లో భారీ రోడ్‌షో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ అగ్రనేతలు హాజరయ్యారు. అంబేద్కర్ విగ్రహానికి నివాళి అర్పించారు ఫడ్నవీస్.

బీజేపీ నుంచి గిరీష్ మహాజన్, చంద్రకాంత్ పాటిల్, పంకజా ముండే, రాధాకృష్ణ విఖే పాటిల్, చంద్రశేఖర్ బవాన్‌కులే, మంగళ్ ప్రభాత్ లోధా, ఆశిష్ షెలార్, జయకుమార్ రావల్, నితేష్ రాణే, శివేంద్ర సింగ్ భోసాలే, పంకజ్ భోయిర్, గణేష్ నాయక్, మేఘనా బోర్దికర్, మాధురి సావ్‌కా మిసాల్, , ఆకాష్ ఫండ్కర్, అశోక్ ఉయికే, జైకుమార్ గోర్ తదితరులు ప్రమాణం చేశారు. శివసేన కోటా నుంచి ఏక్‌నాథ్ షిండే, సంజయ్ శిర్సత్, గులాబ్రావ్ పాటిల్, దాదా భూసే, ఉదయ్ సమంత్, శంభురాజ్ దేశాయ్, యోగేష్ కదమ్, ప్రకాష్ అబిత్కర్, ప్రతాప్ సర్నాయక్, ఆశిష్ జైస్వాల్ ఉన్నారు. ఎన్సీపీ నుంచి నరహరి జిర్వా, హసన్ ముష్రిఫ్, అనిల్ భైదాస్ పాటిల్, అదితి తత్కరే, బాబాసాహెబ్ పాటిల్, దత్తా భర్నే, సనా మాలిక్,

విద్యార్థులతో కలిసి
భోజనం చేసిన ఎంపీ, ఎమ్మెల్యే

టీ మీడియా, డిసెంబర్ 15, వనపర్తి బ్యూరో :

వనపర్తి పట్టణ కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు కస్తూర్బా గాంధీ స్కూల్ ను వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డితో కలిసి సందర్శించి, విద్యార్థులతో కలిసి భోజనం చేసిన నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి . అదేవిధంగా అక్కడే ఏర్పాటు చేసిన సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ తన ఎంపీ నిధులు మొత్తాన్ని గురుకుల, కస్తూర్బా గాంధీ, పాఠశాలలో మౌలిక సదుపాయలు కల్పించడానికే కేటాయించానని తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు మట్టిలో మాణిక్యాలు వారిని అద్భుతంగా తీర్చిదిద్ది తెలంగాణలో భాగస్వాములను చేయడానికి కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వంలో సీఎం రేవంత్ రెడ్డి దృఢ సంకల్పంతో పని చేస్తున్నాడని తెలియజేశారు. విద్యా వ్యవస్థను పటిష్ట పర్చడం ద్వారా విద్యార్థులకు చక్కటి భవిష్యత్తును అందించాలనే కృత నిశ్చయంతో ప్రభుత్వం ఉందన్నారు.ప్రభుత్వం అమలు చేసే కార్యక్రమాలను పూర్తిస్థాయిలో వినియోగించుకుంటూ విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు సంస్కారం నేర్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు.మీకు మంచి వసతులు కలిగిన భవనాలను ఉన్నాయని విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని మంచి చదువు చదివి ఉన్నత స్థాయికి చేరుకొని కని పెంచిన తల్లితండ్రులకు గొప్ప పేరు ప్రక్యతలు తెచ్చిపెట్టాలని విద్యార్థులకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ శాసన మండలి సభ్యులు కపిలా వాయ్ దిలీఫ్ ,మహబూబ్ నగర్ డీసీసీబీ బ్యాంక్ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి ,వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శంకర్ ప్రసాద్ ,మున్సిపల్ చైర్మన్ పుట్టపాగా మహేష్ , వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-2 అభ్యర్థుల కొంప ముంచిన గూగుల్ తల్లి

టి మీడియా, డిసెంబర్ 15,నల్లగొండ :

రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది అభ్యర్థులు గ్రూప్ %-% 2 పరీక్ష రాశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కూడా 150 కేంద్రాల్లో 52 వేల మంది అభ్యర్థులు గ్రూప్ -2 పరీక్షకు హాజరయ్యారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో పరీక్ష కేంద్రాలు కేటాయించారు. సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలోని సన ఇంజనీరింగ్, కిడ్స్ ఇంజనీరింగ్, ఎస్వీ డిగ్రీ, వాగ్దేవి జూనియర్ కాలేజీల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. అయితే చాలామంది అభ్యర్థులు పరీక్ష కేంద్రాలు చేరుకున్నప్పటికీ.. కొందరు పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకోలేకపోయారు. గ్రూప్ 2 పరీక్షకు ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులను పరీక్ష కేంద్రాలకు పోలీసులు, అధికారులు అనుమతించలేదు. నల్లగొండ జిల్లా చింతపల్లికి చెందిన మాల్సూరు, శేఖర్‌లకు కోదాడలో పరీక్ష కేంద్రాలకు అలాట్ చేశారు. చింతపల్లి నుండి బైక్‌పై బయలు దేరిన ఇద్దరు అభ్యర్థులు సరిగ్గా తొమ్మిది గంటల సమయంలో సన ఇంజనీరింగ్ కాలేజి చేరుకోవాల్సిన వీరు%ొ% గూగుల్ మ్యాప్స్ నమ్ముకుని కిడ్స్ ఇంజనీరింగ్ కాలేజి చేరుకున్నారు. తమ పరీక్ష కేంద్రం అది కాదని తెలుసుకొని అడ్రస్ అడుగుతూ సన ఇంజనీరింగ్ పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. కానీ అప్పటికే ఆలస్యం కావడంతో అధికారులు పరీక్ష కేంద్రం లోపలికి వీరిని అనుమతించలేదు. ఎంత ప్రాధేయపడినా అధికారులు కనికరించలేదు. ఎందుకు ఆలస్యమైందని అడిగితే గూగుల్ మ్యాప్స్‌ను నమ్ముకుంటే కొంప ముంచిందని అభ్యర్థులు వాపోయారు.

ఉద్యోగస్తులందరినీ కాపాడుకుంటాం

- **ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే మేఘారెడ్డి**

టీ మీడియా, డిసెంబర్ 15, వనపర్తి బ్యూరో :

ఉద్యోగులను కడుపులో పెట్టుకుని చూసుకునేదే కాంగ్రెస్ పార్టీ. నాడు మీకు ఉద్యోగాలు ఇచ్చింది కాంగ్రెస్ నేడు మీ సమస్యలను పరిష్కరించేది కాంగ్రెస్సే. ఉద్యోగస్తుల ధర్నా శిబిరాన్ని సందర్శించి సర్వ శిక్ష అభియాన్ సమస్యలు తెలుసుకున్న ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే మేఘారెడ్డి. తమ సమస్యలను పరిష్కరించాలి కోరుతూ సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగస్తులు చేపట్టిన నిరసన దీక్ష శిబిరాన్ని ఆదివారం నాగర్కర్నూల్ ఎంపీ మల్లు రవి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సందర్శించి ఉద్యోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో మీకు ఉద్యోగాలు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ నేనని నేడు ఆ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి మీకు న్యాయం చేసేది కూడా కాంగ్రెస్ పార్టీ నేనని వారు వివరించారు. గత ప్రభుత్వంలో ధర్నా చౌక్లను ఎత్తివేసి ధర్నా చేసే వారిని అక్రమ అరెస్టులు చేసి నాన్న ఇబ్బందులకు గురి చేశారని నేడు కాంగ్రెస్ ధర్నాచౌకుల వద్దకే వెళ్లి వారి సమస్యను అడిగి తెలుసుకుంటుందని ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయి ఉందని వారన్నారు.ప్రభుత్వంలో ఉండి విధులను విస్మరించి ఇలా ధర్నాలు చేయడం ద్వారా ఉపయోగం లేదని మన పిల్లలకు అందించే విద్యాబుద్ధులను అందించకుండా వారిని నష్టపరిచిన వారమవుతావని సమస్యల పరిష్కారానికి నేరుగా ధర్నాలు చేయడం మీలాంటి ఉపాధ్యాయులకు సరిపోదని వారు పేర్కొన్నారు.మీ సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి రాష్ట్ర ప్రభుత్వంలోని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపడతామని ఎంపీ, ఎమ్మెల్యే లు ఉద్యోగస్తులకు హామీ ఇచ్చారు.ఏదైనా ధర్నా చేపట్టే ముందు ప్రభుత్వానికి ముందస్తు సమాచారం అందించాలని గత పది సంవత్సరాల సమస్యలు పరిష్కరించేందుకే నేడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిందని నాటి మాదిరి నేడు ధర్నాలు చేయడం సబబు కాదని వారు వారించారు.వీలైనంత త్వరగా మీ సమస్యను పరిష్కరిస్తామని వారు ఉద్యోగస్తులకు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులుతదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన చిన్నారెడ్డి

టీ మీడియా, డిసెంబర్ 15, వనపర్తి బ్యూరో :

వనపర్తి మాజీ ఆర్డీవో, నారాయణపేట అడిషనల్ కలెక్టర్ కందూరి చంద్రారెడ్డి కూతురు వివాహం హస్తినాపురం జిఎస్ఆర్ కన్వెన్షన్ హాల్ లో అంగరంగ వైభవంగా జరిగింది. చంద్రారెడ్డి కూతురు స్ఫూర్తి %ం% కమల్ నయన్ రెడ్డి వివాహానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లేల చిన్నారెడ్డి హాజరై నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. నూతన వధూవరులకు అక్షింతలు వేసి నిండు నూరేళ్లు పిల్లాపాపలతో చల్లగా ఉండాలని దీవించడం జరిగింది. చంద్రారెడ్డి కుటుంబ సభ్యులతో శ్రేయోభిలాషులతో సరదాగా కాసేపు మాట్లాడటం జరిగింది.
వివాహానికి చంద్రారెడ్డి కుటుంబ సభ్యులు, ఆత్మీయులు పాల్గొనడం జరిగింది.

ఉన్నత చదువులపై దృష్టి సారించాలి

- **జిల్లెల చిన్నారెడ్డి**

టీ మీడియా, డిసెంబర్ 15, వనపర్తి బ్యూరో :

వనపర్తి జిల్లా ఘణపురం ప్రభుత్వ ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేసిన రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డి . రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు ప్రభుత్వం హాస్టల్ లో చదువుతున్న విద్యార్థులకు 40% పైన డైట్ , కాస్మోటిక్ ఛార్జిలను పెంచినందున ఘణపురం ప్రభుత్వ ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలలో పాల్గొన్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డి.చిన్నారెడ్డి విద్యార్థులతో మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుండి పెండింగ్లో ఉన్న డైట్, కాస్మోటిక్ చార్జీలను రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవ తీసుకొని పెంచడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ హాస్టల్లో చదువుతున్న విద్యార్థులకు మంచి ఆహారాన్ని, వసతులను కల్పించాలని ఉద్దేశంతో డైట్, కాస్మోటిక్ ఛార్జిలను పెంచడం జరిగింది అని తెలియజేశారు. చిన్నారెడ్డి , స్కూల్ ప్రిన్సిపాల్, స్థానిక కాంగ్రెస్ నాయకులు, సిబ్బంది, హాస్టల్ విద్యార్థులతో కలిసి కొత్త మెనూను ఆవిష్కరించడం జరిగింది. చిన్నారెడ్డి విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేసి స్కూలు,హాస్టల్ పరిసరాలను పరిశీలించి ఇంకా కావాల్సిన అనుమతులను, నిధులను ప్రభుత్వంతో మాట్లాడి ఇప్పిస్తామని తెలియజేయడం జరిగి ంది. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్,మాజీ జెడ్పిటిసి మండల అధ్యక్షుడు విజయ్ కుమార్,దివ్యంగుల జిల్లా అధ్యక్షులు గంజాయి రమేష్, డాక్టర్ నరేందర్ గౌడ్ జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ దేవన్న యాదవ్, మండలం కాంగ్రెస్ నాయకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పొట్టిశ్రీరాములుకు వైఎస్.జగన్ నివాళులు

టీ మీడియా, డిసెంబర్ 15,తాడేపల్లి (అమరావతి) :

పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా వైసిపి అధినేత వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి పొట్టి శ్రీరాములుకు నివాళులు అర్పించారు. ఆదివారం వైఎస్ జగన్ ట్విట్టర్ వేదికగా %ొ% 'ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణాలు అర్పించిన వ్యక్తి పొట్టి శ్రీరాములు. తెలుగువారి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన అమరజీవి శ్రీ పొట్టిరాములుగారి వర్ధంతి సందర్భంగా మనస్ఫూర్తిగా నివాళులు' అంటూ పోస్టు పెట్టారు.

దశదినకర్మకు హాజరైన జిల్లెల చిన్నారెడ్డి

టీ మీడియా, డిసెంబర్ 15, వనపర్తి బ్యూరో :

ఖిల్లా గణపురం మండల కేంద్రానికి సంబంధించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త దేవర్శెట్టి శ్రీనివాసులు దశదినకర్మకు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించడం జరిగింది. సోమ యాజులు అయ్య కీర్తిశేషులై నందున వారి బంధువులను పరామర్శించినారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విజయ్ కుమార్ జిల్లా దివ్యాంగుల సెల్ అధ్యక్షులు గంజాయి రమేష్, డాక్టర్ నరేందర్ గౌడ్, క్యామ బాల్రాజ్, ఎం దేవన్న యాదవ్, మున్నూరు జయకర్ చిట్యాల లింగస్వామి పి యాదగిరి ముజాహిద్, తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అమెరికాలో తెనాలి యువతి దుర్మరణం

- **మరో ఇద్దరికి తీవ్ర గాయాలు**

టీ మీడియా, డిసెంబర్ 15,తెనాలి:

అమెరికాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమంలో గుంటూరు జిల్లా తెనాలి యువతి దుర్మరణం చెందింది. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం .తెనాలికి చెందిన వ్యాపారి గణేష్, రమాదేవి దంపతుల కుమార్తె నాగ శ్రీవందన పరిమళ (26) అమెరికాకు 2022 డిసెంబరులో వెళ్లింది. అక్కడి టెన్నెసీ రాష్ట్రంలో మెంఫిస్‌లో ఎంఎస్ చదువుతుంది. మెంఫిస్ విశ్వవిద్యాలయంలో మాస్టర్ ఆఫ్ సైన్స్ (%మీ%) డిగ్రీ చదువుతుంది. శుక్రవారం రాత్రి ఆమె ఆమె స్నేహితులతో కలిసి కారులో వెళ్తుండగా రాక్‌వుడ్ ఎవెన్యూ సమీపంలో వారు ప్రయాణిస్తున్న కారును ఓ ట్రక్ బలంగా ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలపాలైన శ్రీవందనను సమీపంలోని ఆస్పత్రికి తరలించగా.. పరీక్షించిన వైద్యులు ఆమె మృతి చెందినట్లు ప్రకటించారు.అదే ప్రమాదంలో కారులో ఉన్న పవన్, నికిత్ అనే మరో ఇద్దరు తెలుగు విద్యార్థులు కూడా తీవ్రంగా గాయపడ్డారు. వారిని కూడా ఆసుపత్రికి తీసుకెళ్లారురు. ప్రస్తుతం వీరిలో పవన్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. కాగా పరిమళ మృతదేహాన్ని అమెరికా నుంచి వీలైనంత తొందరగా తెనాలికి తీసుకొచ్చేందుకు తానా ప్రతినిధులు ప్రయత్నిస్తున్నారని మృతురాలి బంధువులు వెల్లడించారు. కాగా గత కొంతకాలంగా వివిధ కారణాల వల్ల అమెరికాలో ఉంటున్న ఇండియన్ విద్యార్థులు వరుసగా మృతి చెందుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంల తాజాగా మరోమారు తెలుగు విద్యార్థి మరణించడంతో అసలిది యాక్సిడెంటా? దీని వెనుక మరెవరైనా ఉన్నారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కరుణగిరి చర్చి లో సెమీ క్రిస్మస్ వేడుకలు

- **ముఖ్యఅతిథిగా బిషపు సగిలి ప్రకాష**

టీ మీడియా, డిసెంబర్ 15,ఖమ్మం:

కరుణగిరిలో లెయిటి ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ ఘనంగా నిర్వహించినారు . అందుకు ముందుగా ప్రత్యేక పవిత్ర ప్రార్థన పూజ నిర్వహించినారు . అనంతరము జరిగిన సభ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఖమ్మం మే త్రాసన బిషప్ శ్రీ శ్రీ శ్రీ సగిలి ప్రకాష్ హాజరైనారు . ఈ సందర్భంగా ప్రజలు వారికి ఘనంగా సన్మానము అందజేసినారు . క్రిస్మస్ కేకు విచ్చేసిన వారందరికీ పంచడం జరిగింది . ఈ సందర్భంగా బిషప్ సందేశం ఇస్తూ ప్రభువు వచ్చి ఉన్నాడు సర్వ మానవాళికి ప్రేమ శాంతి సమాధానము ఇస్తూ ఉన్నాడు దానిని అందరూ పొందుకోవాలి అని , దానికి గుర్తుగా ఈ యొక్క క్రిస్మస్ శుభ ఆశీర్వాదాలు ప్రజలందరూ పొందుకోవాలని , సర్వమానవాళి , శాంతి సహనము , సంతోషాలతో విరాజిల్లాలని ప్రజలు సుఖాలతో అందరం జీవించాలని , సమాజాభివృద్ధికి భాగస్వామ్యం కల్పించుకొని సేవాభావముతో సర్వమానవాళి అభివృద్ధిలోకి రావాలని ఆకాక్షించినారు . ఈ కార్యక్రమంలో లేటి సంఘ పెద్దలు ముత్తమాల ప్రసాదు , కొమ్మ.

ప్రసాదు పాల్గొన్నారు . కరుణగిరి ఫాదర్ మాథ్యూ రాజు , సెక్రెటరీ ఫాదర్ , విజయ్ సహాయక గురువులు అంతోని , సెమినారి గురువులు జయరాజు , చార్లెస్ , వినయ్ తదితరులు ఈ యొక్క ప్రార్థనలో పాల్గొన్నారు . వీరితోపాటు సంఘ పెద్దలు సుదర్శన రావు , నాగరాజు , అంతోటి. రామకృష్ణ , బాలయ్య , బాలస్వామి శాస్త్రి , భాస్కర్ , చిరంజీవి , మోహన్ రావు , జనార్ధన్ , సుందరి , సరోజిని , పద్మ తంబిరాజ్ , ప్రభాకర్ వీరబాబు మరియు ఖమ్మం లో గల వివిధ చర్చిలు , రఘునాథపాలెం , బల్లేపల్లి రమణ గుట్ట, దానవాయిగూడెం , కరుణగిరి , గుట్టల బజార్ , గిరి ప్రసాద్ నగర్ , తదితర ప్రాంతాల నుండి ప్రభు బిడ్డలు హాజరైనారు .

ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధం

- **ఆర్థిక సహాయం అందజేసిన ఏర్వ సాయి ప్రసాద్ యాదవ్**

టీ మీడియా, డిసెంబర్ 15, వనపర్తి బ్యూరో :

వనపర్తి మండలం, అచ్చుతాపురం గ్రామంలో మచ్చ చంద్రయ్య గడ్డివాము ప్రమాదవశత్తు నిప్పు అంటుకొని బూడిద కావడం జరిగింది. రైతు కష్టాన్ని బీ. గాంధీ వనపర్తి జిల్లా యువ నాయకుడు శ్రీ ఏర్వ సాయి ప్రసాద్ యాదవ్ దృష్టికి తీసుకుపోగా వెంటనే స్పందించిన సాయి యాదవ్ రైతు కుటుంబానికి 5,000/- రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో మహేశ్వర్ రెడ్డి, ఎరుకలి రమేష్, కిట్టు గౌడ్, మహేష్, అంజి, శేఖర్, సాయి నరేష్, సురేష్ నాయుడు పాల్గొన్నారు.

పడమటి ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు

టీ మీడియా, డిసెంబర్15 ,మక్తల్:

మక్తల్ మున్సిపాలిటీ కేంద్రంల శ్రీశ్రీశ్రీ పడమటి ఆంజనేయ స్వామి జాతర సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, నల్ల జానమ్మ దేవాలయం నందు ప్రత్యేక పూజల్లో పాల్గొని తదనంతరం పడమటి ఆంజనేయస్వామివారిని దర్శించుకుని స్వామివారికి పట్టు వస్త్రాలు అందజేసింది . ఆలయ అధికారులు పూర్ణకుంభంతో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కుస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, నారాయణపేట జిల్లా డిసిసి అధ్యక్షులు కె.ప్రశాంత్ కుమార్ రెడ్డి,పోలీస్ చంద్రశేఖర్ రెడ్డి ,బాలకృష్ణారెడ్డి ,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,అన్ని మండలాల అధ్యక్షులు,టౌన్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

గంగపుత్ర సొసైటీ ప్రధాన కార్యదర్శిగా గాండ్ల నరేందర్

టీ మీడియా, డిసెంబర్ 15, వనపర్తి బ్యూరో :

ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా బెస్త గంగపుత్ర సంఘ సొసైటీ అధ్యక్ష ఎన్నికలలో మన వనపర్తి జిల్లా ఖిల్లా ఘణపురం మండల కేంద్రానికి చెందిన గాండ్ల నరేందర్ ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన శుభ సందర్భంగా వారికి ఉమ్మడి జిల్లా నాయకులు వనపర్తి జిల్లా నాయకులు మండల నాయకులు సభ్యులు ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు. వనపర్తి జిల్లా నుండి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన గాండ్ల నరేందర్ మాట్లాడుతూ మత్సకారులైన బెస్త సంఘలకు సంఘ సభ్యులకు అన్ని విధాల అందుబాటులో ఉంటూ వారికి సొసైటీ తరఫున అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తారని పేర్కొన్నారు.ఈ యొక్క ఎన్నికలలో వనపర్తి జిల్లా తరఫున ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా నియమించినందుకు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

జూనియర్ కాలేజ్ లెక్చరర్‌గా నియామకం

టీ మీడియా, డిసెంబర్ 15, వనపర్తి బ్యూరో :

తోటి చిన్ననాటి మిత్రుడు ఇంటర్మీడియట్ క్లాసుమేట్ చందాపూర్ గ్రామానికి చెందిన అనిల్ నాయుడు ప్రస్తుతం పెద్దమందడి మండలంలో ట్రైబల్ జూనియర్ కాలేజ్ లో లెక్చరర్ గా పనిచేస్తూఇటీవల విడుదల అయిన ఫలితాలలో రెండవ సారి కూడా జూనియర్ కాలేజ్ లెక్చరర్ గా నియామకం కాబోతున్న అనిల్ నాయుడు కి శాలువాతో సన్మానం చేసిన గడ్డం వినోద్ యాదవ్ వనపర్తి అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కో కోఆర్డినేటర్. ఈ కార్యక్రమంలో పెద్దమందడి మండలం సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు, మల్లేష్ పాల్గొన్నారు.

అన్నిరకాలు ధాన్యం కొనుగోలు చేయాలి

- **వైరా ఎమ్మెల్యేకు సీపీఐ(ఎం) వినతి**

టీ మీడియా, డిసెంబర్ 15,కారేపల్లి :

ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అన్ని రకాల ధాన్యంను కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఆదివారం వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ కు విన్నవించారు. కారేపల్లి మండలం రావోజీతండాకు చెందిన లాక్మ అనే రైతు తన వడ్లు ఎంటీయు రకంను కొనుగోలు చేయటం లేదని ధాన్యం తీసుకోని సీపీఐ(ఎం) వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం తో కలిసి వైరా ఎమ్మెల్యే దృష్టికి తీసుకవచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే వైరా ఏడీఏ తో మాట్లాడారు. రైతుల అన్ని రకాల వడ్లు కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దొడ్డు రకం వడ్లు కొనుగోలుకు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఈసందర్భంగా సీపీఐ(ఎం) వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, జిల్లా కమిటీ సభ్యులు కొండెబోయిన నాగేశ్వరరావులు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో కేవలం బీపీటీ రకాన్ని మాత్రమే మిల్లర్లు తీసుకుంటున్నారని ప్రభుత్వం ప్రకటించిన మిగతా సన్న రకాల కొనుగోలుకు మిల్లర్లు ఇబ్బందులు పెడుతున్నారన్నారు. కారేపల్లి మండలంలో వరి కోతలు ఆలస్యంగా ప్రారంభం అవుతాయని ప్రస్తుతం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం వచ్చి ఉందన్నారు. ఈసమయంలో రైతుల ధాన్యం కొనుగోలు చేయకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు మిల్లర్లు ముందుకు రావటం లేదని చేతులు ఎత్తేస్తున్నారని దీనిపై ఉన్నతాధికారులు దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కే.నరేంద్ర, నాయకులు కొండెబోయిన ఉమావతి, రేగళ్ల మంగయ్య, అజ్మీర శోభన్‌నాయక్, ఎం.స్వరూప తదితరులు పాల్గొన్నారు.

లగచర్ల రైతులపై కేసులు ఎత్తివేయాలి

- **రైతు సంఘం**

టీ మీడియా, డిసెంబర్ 15,కారేపల్లి :

పార్మసిటీ కోసం లగచర్లలో భూ సేకరణను అడ్డుకున్న రైతులపై పెట్టిన కేసులను ఎత్తి వేయాలని తెలంగాణ రైతు సంఘం మండల అధ్యక్షకార్యదర్శులు ముండ్ల ఏకాంభారం, వజ్జా రామారావులు డిమాండ్ చేశారు. ఆదివారం కారేపల్లిలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారిన రైతులపై నిర్బాంధాలు ఆగటం లేదన్నారు. అభివృద్ధి పనులకు భూముల సేకరణ అవసరమైతే రైతులను ఒప్పించి సేకరించాలని తప్ప రైతులను బెదిరించి, నిర్బంధించి భూములను తీసుకోవటం ప్రభుత్వ ప్రతిష్టకు నష్టదాయమన్నారు.లగచర్ల ఘటనలో రైతులను సంఘ వ్యతిరేక శక్తుల మాదిరిగా బేడీలతో ఆసుపత్రికి, జైలుకు తరలించటం ఆక్షేపనీయమన్నారు. దీనికి కారకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులపై పెట్టిన కేసులనుఎత్తివేసి ప్రభుత్వం రైతు పక్షం ఉన్నామని నిరూపించుకోవాలన్నారు. రైతుల ధాన్యం కొనుగోలులో సమస్యలు వస్తున్నాయని వాటిపై అధికారులు దృష్టి పెట్టాలని కోరారు. ఈకార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వల్లభినేని మురళి, షేక్ సైదులు, పాసిన్ని నాగేశ్వరరావు, అన్నారపు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారిని ఆశీర్వదించిన ఎమ్మెల్యే

టీ మీడియా, డిసెంబర్ 15,కారేపల్లి :

కారేపల్లిలోని వెంకటసాయి నగర్‌లో జరిగిన ఓణి కట్టు వేడుకకు వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, ఆయన తనయుడు మాలోత్ విఘ్నేష్‌నాయక్ లు ఆదివారం హాజరైనారు. రాము%-%శారధ దంపతుల కుమార్తె సాయి ఆరాధ్య ఓణిల వేడుకలో పాల్గన్న ఎమ్మెల్యే చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సోసైటీ డైరక్టర్ బానోత్ హీరాలాల్, న్యాయవాధి సర్సింగ్ శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ అధ్యక్షులు మేదరి వీరప్రతాఫ్(టోనీ), ఎస్టీ సెల్ జిల్లా నాయకులు గుగులోత్ భీముడు, కాంగ్రెస్ నాయకులు ఎండీ.యాకూబ్అలీ, కిలారి అప్పారావు, ఎండీ.హనీఫ్, మేదరి రాజా, ఎండీ.హనీఫ్, వాంకుడోత్ గాంధీ, కిలారి అప్పారావు, షపీ, జర్పుల ప్రసాద్, జానీ, చందునాయక్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు రాష్ట్రాలపై చలిపులి..పంజా

- హైపోథెర్మియా వంటి వ్యాధులు
- వైద్యుల హెచ్చరిక

టి మీడియా, డిసెంబర్ 15, హైదరాబాద్ బ్యూరో:

తెలుగు రాష్ట్రాలపై చలిపులి..పంజా విసురుతోంది. ఉన్నట్లుండి ఉష్ణోగ్రతలు భారీగా పడిపోయాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో సింగిల్ డిజిట్‌కు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో ప్రజలు గజ గజ వణికిపోతున్నారు. పెరిగిన చలి తీవ్రతతో ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే వణికిపోతున్నారు.

కనిష్టంగా 6.2 డిగ్రీల ఉష్ణోగ్రత

ఆదిలాబాద్‌లో కనిష్టంగా 6.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదుకాగా..అల్లూరి జిల్లా మినుములూరులో 8 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత రికార్డయింది. నిర్మల్‌లో 8.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో చలి తీవ్రత విపరీతంగా పెరిగింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా సాధారణం కన్నా 5.5 డిగ్రీలు తక్కువగా ఉష్ణోగ్రత నమోదవుతున్నాయి. రానున్న రోజుల్లో కూడా చలి తీవ్రత కొనసాగే అవకాశం ఉంది. ఆదిలాబాద్, కుమ్రంభీమ్ జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది..వాతావరణశాఖ. మరోవైపు మెదక్ జిల్లా గతంతో పోలిస్తే చలితీవ్రత పెరిగిందని చెబుతున్నారు. స్థానికులు.ఇక హైదరాబాద్ నగరంలోనూ కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో 14 డిగ్రీల సెల్సియస్‌కు తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ముఖ్యంగా శివారు ప్రాంతాల్లో చలిపులి పంజా విసురుతోంది. రానున్న రోజుల్లో చలి తీవ్రత మరింత పెరిగే ఛాన్స్ ఉందంటున్నారు..వాతావరణశాఖ అధికారులు. దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా గర్భిణీలు, బాలింతలు, చిన్న పిల్లలు, వృద్ధులు జాగ్రత్తగా ఉండాలని..ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని చెబుతున్నారు.

తీవ్రమైన చలితో హైపోథెర్మియా వంటి వ్యాధులు

తీవ్రమైన చలితో హైపోథెర్మియా వంటి వ్యాధులు వచ్చే అవకాశముంది. దీంతో గర్భిణిలు, చిన్నపిల్లలు, వృద్ధులు, శ్వాస సంబంధిత ఇబ్బందులు ఉన్నవాళ్లు అప్రమత్తంగా ఉండాలని చెబుతున్నారు వైద్యులు. చలి తీవ్రతతో ఇంట్లో కర్రలు, బొగ్గుల కుంపటి వెలగించడం వంటివి చేయవద్దని.. దీని వల్ల కార్బన్ మోనాక్సైడ్ ప్రభావంతో అనారోగ్య సమస్యలు వస్తాయని హెచ్చరిస్తున్నారు. మరోవైపు అల్లూరి జిల్లా పాడేరు ఏజెన్సీలో భారీగా పెరిగింది చలి తీవ్రత. ఓవైపు దట్టంగా కురుస్తున్న పొగమంచు..మరోవైపు ఎముకలు కొరికే చలితో గిరిజనుల అవస్థలు పడుతున్నారు. ఇక ఈ పొగమంచులో ఏజెన్సీ అందాలను చూసేందుకు..భారీగా తరలివస్తు న్నారు..పర్యాటకులు. స్థానికంగా టెంట్లు వేసుకొని చలిమంటలతో సేదతీరుతున్నారు.బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉండటంతో తెలుగురాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు కొద్దిగా పెరుగుతాయని అంచనా. అయితే, రాత్రి ఉష్ణోగ్రతలు మాత్రం మరింత తగ్గే అవకాశం ఉందని చెబుతున్నారు..వాతావరణ నిపుణులు.

పోడు భూములకు విద్యుత్ సౌకర్యంకు

- సోలార్ విద్యుత్తుకు విది విధానాలు ప్రకటించాలి
- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం విజ్ఞప్తి

టీ మీడియా, డిసెంబర్ 15,మధిర :

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం జిల్లా కమిటీ ఆదివారం మధిరలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్తు, శాఖలను నిర్వహిస్తున్న గౌరవ శ్రీ బట్టి విక్రమార్క గారిని కలిసి పోడు సాగు చేసుకుంటున్న రైతులకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని వినతిపత్రంలో వివరించడం జరిగింది. ఫారెస్ట్ అధికారులు క్లియరెన్స్ ఇవ్వట్లేదని ఆంక్షలతో అర్హులైన పోడు సాగుదారులకు రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ కనెక్షన్లు ఇవ్వకపోవడం వలన రైతులు పంటల సాగుకు నీళ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆ వినతిలో సంఘం నాయకులు తెలిపారు .ఇటీవల రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి గారు పోడు భూముల్లో సోలార్ విద్యుత్తు సరఫరాకు అవకాశం కల్పిస్తామన హామీని సంఘం తరఫున స్వాగతిస్తున్నాము. రైతుల మీద భారం పడకుండా విది విధానాలు రూపొందించి అర్హులైన పోడు సాగు రైతులందరికీ ఎలాంటి ఆంక్షలు లేకుండా సోలార్ విద్యుత్తు అందించాలని వినపత్రములో పేర్కొన్నారు .ఉప ముఖ్యమంత్రి బట్టి గారు సానుకూలంగా స్పందించి పోడు సాగు రైతుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మెరుగు సత్యనారాయణ, పొన్నం వెంకటేశ్వరరావు ,గారు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యర్రా శ్రీనివాసరావు ,ప్రతాపనేని వెంకటేశ్వర్లు ,సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తెలపోలు రాధాకృష్ణ ,తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక రైలు నడపాలి

- తెలంగాణ ఉద్యమకారుడు రామలింగం

టీ మీడియా, డిసెంబర్ 15 ,మక్తల్:

మక్తల్ పడమటి ఆంజనేయస్వామి జాతర సందర్భంగా హైదరాబాద్ నుండి రెండు ప్రత్యేక రైళ్లు రోజు నడపాలని మహబూబ్ నగర్ రైల్వే జనరల్ మేనేజర్ ప్రశాంత్ కుమార్ తో తెలంగాణ ఉద్యమకారుడు రామలింగం కోరాడు. పడమటి ఆంజనేయ స్వామి ఉత్సవాల సందర్భంగా రోజు రెండు డెమో రైలు నడపాలని కోరగా,తక్షణమే స్పందించిన మహబూబ్ నగర్ జిల్లా రైల్వే అధికారి సికింద్రాబాద్ జోనల్ అధికారితో మాట్లాడి ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. మక్తల్ స్టేషన్ మేనేజర్ రత్నేష్ మాకు తక్షణమే స్పందించి ప్రత్యేక రైలు వేపిస్తామని చెప్పినందుకు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

గ్రూప్-2 పరీక్షకు ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులు

టీ మీడియా, డిసెంబర్ 15,జయశంకర్ భూపాలపల్లి :

జిల్లాలో గ్రూప్-2 పరీక్షకు ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులను అధికారులు లోనికి అనుమతించక పోవడంతో వెనుదిరిగారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల శ్రీ చైతన్య పాఠశాలల అలాగే కెటీపీపి ఢీ ఏ వీ సెంటర్ కు ఆలస్యంగా వచ్చిన సుమలత, రామ్ సింగ్, రాంబాబు, సద్గుణ అనే అభ్యర్థులు 9.30 గంటల తర్వాత ఐదు పది నిమిషాలు లేటుగా రావడంతో నిర్వాహకులు లోనికి అనుమతించలేదు. దీంతో చేసేది ఏమీ లేక అభ్యర్థులు ఉదయం పేపర్ కు హాజరు కాలేక వెనుదిరిగారు. అభ్యర్థులు కొందరు సుదూర ప్రాంతాలనుండి రావడం తో పాటు టీ జీ పీ ఎస్సీ సూచనలు పాటించక పోవడం వల్లే నిర్లక్ష్య ధోరణి తో అలస్యమైనట్లు తెలుస్తుంది.

వైభవంగా రథోత్సవం

టీ మీడియా ,డిసెంబర్ 15, మక్తల్:

నారాయణ పేట జిల్లా మక్తల్ శ్రీ పడమటి ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవ మహోత్సవం లో పాల్గొన్న మక్తల్ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్ రెడ్డి,అధిక సంఖ్యలో పాల్గొన్న మక్తల్ మండల ప్రజలు భక్తులు, వివిధ పార్టీల నాయకులుపాల్గొన్నారు.

మేడారంలో భక్తుల సందడి..

టీ మీడియా, డిసెంబర్ 15,తాడ్వాయి :

వనదేవతల దర్శనానికి భక్తులు భారీగా తరలిరావడంతో మేడారంలోని సమ్మక్క- సారలమ్మ గద్దెల ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది. ఆదివారం సెలవుదినం కావడం భక్తులు వేలాదిగా దూర ప్రాంతాల నుండి భక్తులు తల్లుల దర్శనానికి పిల్లా పాపలతో తరలివచ్చారు. తల్లులకు మొక్కులు చెల్లించుకున్నారు. రెండు తెలుగు రాష్ట్రాలే కాకుండా సరిహద్దు రాష్ట్రాలైన చత్తీస్గఢ్ మహారాష్ట్రా నుండి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. మొదట జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించి తల్లుల గద్దెలకు చేరుకొని పూలు,కుంకుమ, బంగారం, కొత్త బట్టలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా దేవాదాయశాఖ అధికారులు, ఆలయ పూజారులు సకల సౌకర్యాలు కల్పించారు.వేలాది మంది భక్తుల రాకతో ఆదివారం నాడు మేడారం పరిసరాలు భక్తులతో జనసంద్రంగా మారాయి.

ఐక్య పోరాటంతో రెవిన్యూ డివిజన్ సాధిద్దాం

టీ మీడియా, డిసెంబర్ 15,దుబ్బాక:

రెవిన్యూ డివిజన్ తోనే దుబ్బాక అభివృద్ధి సాధ్యమవుతుందని..రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కోసం ప్రజలు కుల,మతాలు,రాజకీయాలకతీతంగా కలిసికట్టుగా పోరాడి రెవిన్యూ డివిజన్ ను సాధిద్దామని దుబ్బాక డెవలప్మెంట్ ఫోరం అధ్యక్షులు మాడబోయిన శ్రీకాంత్ కోరారు.రెవెన్యూ డివిజన్ డిమాండ్ ఏళ్ల నాటిదని,ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ,ఎంపీ మాధవనేని రఘునందన్ రావు,కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డిలు ఎన్నికల్లో ఇచ్చిన హామీకి కట్టుబడి ఉండాలని గుర్తు చేశారు.ఆదివారం దుబ్బాక పట్టణ కేంద్రంలోని వర్తక సంఘంలో ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశంలో సీపీఐ(ఎం) దుబ్బాక మండల,మున్సిపల్ కార్యదర్శులు సింగిరెడ్డి నవీన,కొంపల్లి భాస్కర్,బీఆర్ఎస్ కౌన్సిలర్ ఆస యాదగిరి,ఓబిసి మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకోజ్ ప్రవీణ్ కుమార్ పలువురు హాజరై రెవిన్యూ డివిజన్ సాధన కోసం అనుసరించాల్సిన కార్యాచరణ పట్ల మాట్లాడారు.త్వరలోనే దుబ్బాక నియోజకవర్గంలోని అన్ని పార్టీల నాయకులు,ప్రజాసంఘాల నాయకులతో జేఏసీగా ఏర్పడి రోజుకో విధంగా ఇక్కడి ప్రజల ఆకాంక్ష తెలుపుతూ ప్రభుత్వ దృష్టికెళ్లేలా కార్యచరణ రూపొందిస్తామన్నారు.రెవిన్యూ డివిజన్ సాధనలో కుల,మత,రాజకీయాలకతీతంగా అందరం కలిసికట్టుగా పోరాడదామని విజ్ఞప్తి చేశారు.ఈ అఖిలపక్ష సమావేశంలో సీపీఐ(ఎం) నాయకులు సాధిక్,లక్ష్మీనారాయణ, ఎల్లం,మల్లేశం,బీజేపీ నాయకులు శ్రీకాంత్, మల్లికార్జున్, వ్యాపారస్తులు బాలకృష్ణ, దీక్షిత్ పలువురు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి

- మాజీ సర్పంచుల దీక్షల ముగింపు

టీ మీడియా, డిసెంబర్ 15,కరీంనగర్ :

జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు తాజా మాజీ సర్పంచులు పెండింగ్ బిల్లుల విడుదల కోసం గత ఆరు రోజులుగా తమ ఆందోళనను కొనసాగిస్తున్నారు. శనివారంతో రిలే నిరాహారదీక్షలు ముగించినట్లు త్వరలో భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామని జేఏసి అధ్యక్షుడు జోగు లక్ష్మీరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ కాలంలో (2019-2024) గ్రామాల అభివృద్ధి కోసం రైతు వేదికలు, స్మశానవాటికలు, డంపింగ్ యార్డులు, క్రీడా ప్రాంగణాలు, పల్లె ప్రకృతి వనాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కమ్యూనిటీ భవనాలు, హైమాస్ట్ లైట్లు వంటి అనేక అభివృద్ధి పనులు చేపట్టి అధికారుల ద్వారా అంగీకరింపజేసినప్పటికీ, రెండు సంవత్సరాలుగా సకాలంలో బిల్లులు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికీ పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా కొంత మంది సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. ఈ విషయంలో ప్రభుత్వం స్పందించకపోవడం పట్ల తీవ్ర నిరసన వ్యక్తమవుతోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెండింగ్ బిల్లులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని సర్పంచులు డిమాండ్ చేశారు.పెండింగ్ బిల్లులు చెల్లించకపోతే మా జీవనానికి ఆత్మహత్యలే శరణ్యం అవుతాయన్నారు.ప్రభుత్వం ఏడాది గా ఈ సమస్యపై స్పందించకపోవడం బాధాకరమని, పెండింగ్ బిల్లులు విడుదల చేసి తమ కుటుంబాలను ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.రిలే నిరాహార దీక్షల చివరి రోజైన 6వ రోజున జెఏసి జిల్లా అధ్యక్షుడు జోగు లక్ష్మీరాజం, రాష్ట్ర నాయకులు వేముల దామోదర్, నవీన్ రావు, కంకణాల విజేందర్ రెడ్డి, పుల్కం గంగన్న, ఎండి నజీర్ హుస్సేన్, వడ్లూరి ఆదిమల్లు, పాంజాల జగన్ మోహన్ గౌడ్, మడ్డపెల్లి గంగాధర్, జుట్టు రాజేశ్వరి లచ్చయ్య, మునింధర్ రెడ్డి, కొంకటి శంకర్ తదితరులు పాల్గొని ప్రభుత్వానికి తమ డిమాండ్లను విన్నవించారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులు తొమ్మిదవ రోజు

- కళ్ళకు గంతలు కట్టుకొని నిరసన

టీ మీడియా, డిసెంబర్ 15,కంఠేశ్వర్

తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం నిజామాబాద్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చౌరస్తా లో ధర్నా చౌక్ లో 09 వరోజు సమ్మె లో భాగంగా కళ్ళ గంతలు కట్టుకోని వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు రాజు మాట్లాడుతూ.. తమ యొక్క న్యాయపరమైన డిమాండ్ల సాధన కొరకు తొమ్మిది రోజులుగా నిరసనలు సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు ముఖ్యంగా తొమ్మిది రోజుల నుంచి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో బోధన నిలిచిపోయిన కల్లుండి చూడలేని కబోదిలా ప్రభుత్వం వ్యవహరిస్తుందని అందుకే తాము కళ్ళకు గంతలు కట్టుకుని నిరసన చేస్తున్నామని ఇకనైనా తమ న్యాయపరమైన డిమాండ్ రెగ్యులరైజేషన్ సత్వరమే చేయాలని కోరారు ఈ యొక్క దీక్షలకు సంఘీభావం తెలుపడానికి విచ్చేసిన తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బట్టు బద్రీనాథ్ మాట్లాడుతూ.. సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయపరమైన డిమాండ్ల సాధనకు తపస్ ఉపాధ్యాయ సంఘం అండగా ఉంటుందని తెలియజేశారు. ఈ యొక్క దీక్ష శిబిరానికి విచ్చేసి సంఘీభావం తెలియజేసిన టి ఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సత్యానంద్ మాట్లాడుతూ.. పోరాటాలకు చిరునామా టీఎస్ యుటిఎఫ్ అని మీ యొక్క న్యాయపరమైన కోరికల సాధనకు అవసరమైన సందర్భంలో టిఎస్ యుటిఎఫ్ ప్రత్యక్ష పోరాటానికైనా సిద్ధమని ఆయన తెలియజేశారు ఈ కార్యక్రమంలో తపస్ జిల్లా నాయకులు కిషన్,నరసయ్య, యుటిఎఫ్ నాయకులు రమేష్ సాయన్న, పి ఆర్ టి యు ఆలూరు మండలం ప్రధాన కార్యదర్శి శివప్రసాద్ ,సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ ప్రధాన కార్యదర్శి భూపేందర్ మహిళా అధ్యక్షురాలు గంగామణి, నాయకులు ప్రకాష్, అప్సర్, రవి కిరణ్, జాన్ సత్యపాల్ గంగాధర్ ,ప్రభు ,రమేష్ ,రాణి, సుప్రజా ,పద్మ తదితరులు పాల్గొన్నారు.

జగమొండి లేండి పూర్తి చేయడమే లక్ష్యం

- పట్టుబడుతున్న ఎమ్మెల్యే
- రైతుల ఆశలు నెరవేర్చండి
- మంత్రి ఉత్తమ్ కి విన్నపం..

టీ మీడియా, డిసెంబర్ 15,మద్దూర్:

సంయుక్తంగా ఇరు రాష్ట్రాలు కలిసి నిర్మాణం చేపట్టిన జగమొండి లేండి అంతరాష్ట్ర ప్రాజెక్టు నిర్మాణం పనులు ఏళ్ల తరబడి పెండింగ్ లోనే ఉంటున్నాయి. అంతరాష్ట్ర లేండి ప్రాజెక్టు పూర్తి చేయడమే తమ లక్ష్యమని జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు పలుమార్లు ప్రజలకు వ్యవసాయ రైతులకు హామీ ఇస్తూ వస్తున్నారు. ఇటీవల నిజాంసాగర్ ప్రాజెక్టు నుండి నీటి విడుదల కోసం వచ్చిన రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డికి జుక్కల్ ఎమ్మెల్యే రైతు ఆశలు నెరవేర్చండి. అంతరాష్ట్రలేండి ప్రాజెక్టును పూర్తి చేయడం కోసం సహకరించండి అంటూ నిజాంసాగర్ మండల కేంద్రంలో మంత్రికి విన్నవించారు. లేండి ప్రాజెక్ట్ నిర్మాణం కోసం అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు అప్పటి మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఎస్ బి చౌహాన్ కలిసి ఇరువు రాష్ట్రాలు సంయుక్తంగా నిర్మించడానికి 1983- 84, సంవత్సరంలో ఒప్పందాలు జరుపుకున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం దాదాపు 40 సంవత్సరాల క్రితం ఒప్పందాలు జరిగిన అంతరాష్ట్ర లేండి ప్రాజెక్టు పూర్తి చేయడంలో మన రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తుందని ఆరోపణలు ప్రజల్లో వ్యక్తం అవుతున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాకపోయినా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంలోనైనా అంతరాష్ట్ర లేండి ప్రాజెక్టు నిర్మాణానికి ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేని పరిస్థితి. ఉమ్మడి రాష్ట్రంలో ప్రత్యేక రాష్ట్రంలో లేండి ప్రాజెక్టు నిర్మాణంలో పూర్తిగా నిర్లక్ష్యమే జరిగింది 40 ఏళ్ల కాలంగా పూర్తి కాకుండా జగమొండిగా మారిన ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం ప్రస్తుతం జుక్కల్ ఎమ్మెల్యేగా కొనసాగుతున్న తోట లక్ష్మీ కాంతారావు మహారాష్ట్ర అధికారులతో చర్చలు జరపడం ఒకసారి అంతరాష్ట్ర లేండి ప్రాజెక్టును సందర్శించడం జరిగింది. ఈ ప్రాజెక్టు పూర్తి కావాలంటే కావలసిన ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డికి ఎమ్మెల్యే విన్నవిస్తూ.. రైతు ఆశలు నెరవేర్చాలని ఏళ్ల తరబడి పెండింగ్ లో ఉంటున్న లేండి ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కావడానికి పూర్తిగా సహకరించాలని కోరడం జరిగింది. వెనుకబడ్డ జుక్కల్ ప్రాంతం వ్యవసాయ రంగ అభివృద్ధి కోసం అంతరాష్ట్ర లేండి ప్రాజెక్టు పూర్తి చేస్తే నియోజకవర్గంలోని మద్దూర్ బిచ్కుంద డోంగ్లి మూడు మండలాల వ్యవసాయానికి సాగునీరు అందుతుందని, 22 వేల ఎకరాలు సాగులోకి వస్తుందని ఈ ప్రాజెక్టు నిర్మాణంలో నిర్లక్ష్యం జరగడం రైతుల ఆశా నెరవేరడం లేదని కచ్చితంగా లేండి ప్రాజెక్టు పూర్తి కావడానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సంబంధిత శాఖ మంత్రికి విన్నవించడం.. లేండి ప్రాజెక్టు నిర్మాణానికి కదలికలు తీసుకువస్తున్నారు. ఎమ్మెల్యే పట్టుదల జగమొండి లేండి ప్రాజెక్టు నిర్మాణం పనులు మహారాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాలు కుదుర్చుకునే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో అంతర్ రాష్ట్ర లేండి ప్రాజెక్టు పూర్తి అవుతే వెనుకబడ్డ జుక్కల్ నియోజకవర్గం లోని మూడు మండలాలకు సాగునీరు అందించడం ప్రజల ఆశలు నెరవేర్చడంలో ఈ ఘనత జుక్కల్ ఎమ్మెల్యేకు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి దక్కుతుంది.

బీఆర్ఎస్ ప్రమాదబీమా చెక్కులు పంపిణీ

టీ మీడియా, డిసెంబర్ 15,కామారెడ్డి:

బిఆర్ఎస్ ప్రమాద బీమా చెక్కులను ఆదివారం కామారెడ్డి మాజీ శాసనసభ్యులు గంప గోవర్ధన్ బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బి ఆర్ ఎస్ పార్టీ కార్యకర్తల సభ్యత్వ నమోదు సమయంలో వారి పేరు పై ప్రమాదబీమా ఎల్ఐసి ఇన్సూరెన్స్ పాలసీ బి ఆర్ ఎస్ పార్టీ తరపున ప్రిమియం కట్టడం వలన కార్యకర్తలు ప్రమాదవశాత్తూ మరణిస్తే వారికి ఇన్సూరెన్స్ కంపెనీ నుండి బాధిత కుటుంబానికి 2 లక్షల రూపాయల ఆర్థిక సాయం చెక్కు పంపిణీ చేశారు. ఇందులో భాగంగా గత కొన్ని రోజుల క్రితం మాచారెడ్డి మండలం లచ్చపేట్ గ్రామానికి చెందిన బి ఆర్ ఎస్ పార్టీ కార్యకర్తలు ఇద్దరు కైరంకొండ శివరాములు, జక్కుల రాంచంద్రం ప్రమాదవశాత్తూ మృతి చెందారు. వారి కుటుంబాలకు ఆదివారం బి ఆర్ ఎస్ పార్టీ తరపున కామారెడ్డి మాజీ శాసనసభ్యులు ప్రమాదబీమా చెక్కులను చేతుల మీదగా కీ. శే కైరంకోండ శివరాములు బార్యా లక్ష్మి, జక్కుల రాంచంద్రం బార్యా నిలవ్వ లకు ఒక్కొక్కరికి రెండు లక్షల రూపాయల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాచారెడ్డి మాజీ జడ్పీటీసీ మీన్కురి రాంరెడ్డి, నల్లవేల్లి ఆశోక్, శంకర్, గెరిగంటి లక్ష్మినారాయణ, లచ్చపేట్ మాజీ ఎంపీటీసీ బుస శ్రీనివాస్, లద్దురి కృష్ణ యాదవ్, దినేష్ లచ్చపేట్ గ్రామ బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హుస్సేన్ సాగర్‌లో తేలిన బాలుడి మృతదేహం..

టీ మీడియా, డిసెంబర్ 15,హైదరాబాద్:

జిహెచ్ఎంసి అధికారుల నిర్లక్ష్యం నిండు ప్రాణాలను బలి తీసుకుంది. ఫతే నగర్ డివిజన్ లోని ఇందిరాగాంధీ పురం నాలాలో బాలుడు పడి కొట్టుకపోయాడు. హుస్సేన్ సాగర్ లో బాలుడి మృతదేహం లభ్యమైంది. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సంఘటన స్థలానికి చేరుకొని బాధిత కుటుంబానికి 20 వేల ఆర్థిక సాయం చేశారు. జిహెచ్ఎంసి అధికారుల నిర్లక్ష్యం వల్లే బాలుడు నాలతో పడి చనిపోయాడని ఎమ్మెల్యే కృష్ణారావు మండిపడ్డారు. ఎమ్మెల్యే ఎన్నిసార్లు ఫోన్ చేసిన జిహెచ్ఎంసి కమిషనర్ స్పందించడం లేదని విమర్శలు గుప్పించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయడంతో పాటు నష్టపరిహారం చెల్లించాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు డిమాండ్ చేశారు.

పర్యావరణహితంలో సింగరేణి

- మరో ప్రతిష్టాత్మక అవార్డు

టీ మీడియా, డిసెంబర్ 15,హైదరాబాద్:

పర్యావరణహిత, సుస్థిర మైనింగ్ తో పాటు సంప్రదాయేతర విద్యుత్ రంగంలో విశేషమైన సేవలు అందిస్తున్నందుకు సింగరేణికి జాతీయ స్థాయిలో మరో ప్రతిష్టాత్మక ఎనర్షియా ఫౌండేష న్ అవార్డుదక్కింది. భారత దేశం, దక్షిణాసియాలో సుస్థిర ఇంధన, పునరుద్పాదక ఇంధన వనరులను ప్రోత్సహించడంలో అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తున్న సంస్థలను ఎనర్షియా ఫౌండేషన్ ప్రతీ ఏడాది పురస్కారాలను అందజేస్తుంది.ఈ ఏడాది 'ఇండియాస్ బెస్ట్ అండ్ మోస్ట్ సస్టేనబుల్ కోల్ మైనింగ్ ఆపరేటర్ విత్ రెన్యూవబుల్ ఎనర్జీ అడాప్షన్' కేటగిరీలో సింగరేణిని అత్యుత్తమ సంస్థగా ఎంపిక చేసినందుకు గాను సింగరేణి సంస్థ చైర్మన్, ఎండీ ఎన్ బలరామ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ నెల 20న విశాఖపట్నంలో అవార్డుల ప్రదానం జరుగనుందని అవార్డు కమిటీ జ్యూరీ కన్వీనర్ ఆర్.త్యాగరాజన్ అయ్యర్ పేర్కొన్నారు.

పర్యావరణహిత చర్యలకు గుర్తింపు: సీఎండీ ఎన్. బలరామ్

ఎనర్షియా వారు ప్రకటించిన జాతీయ స్థాయి అవార్డు సింగరేణి సంస్థ చేపడుతున్న పర్యావరణహిత చర్యలకు గుర్తింపు వంటిదని సీఎండీ ఎన్. బలరామ్ అన్నారు. సింగరేణి సంస్థ ఈ స్ఫూర్తితో తన పర్యావరణ చర్యలను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తూ ముందుకు పోతుందని తెలిపారు.ఒడిశాలో నైనీ బొగ్గు గనికి అనుబంధంగా పర్యావరణహితంగా 1,600 మెగావాట్ల అత్యాధునిక సూపర్ క్రిటికల్ థర్మల్ ప్లాంట్ చేపట్టే ప్రతిపాదన ఉందని సీఎండీ వెల్లడించారు. రామగుండంలో 500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ ప్లాంట్ ఏర్పాటు, భారీ జలాశయాల్లో ఫ్లోటింగ్ సోలార్ ఏర్పాటుకు సన్నాహాలు , కార్బన్ డై యాక్సైడ్ నుంచి మిథనాలు తయారీ తదితర చర్యలతో పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నామని వివరించారు.

సింగరేణి సంస్థ ఆరు కోట్ల కు పైగా మొక్కలు నాటడమే కాక వాటిని వనాలుగా పెంచుతోందన్నారు. అలాగే పర్యావరణహిత మైనింగ్ పద్ధతులైన సర్ఫేస్ మైనర్, కంటిన్యూయస్ మైనర్, ఇన్ పిట్ క్రషర్ అండ్ కన్వేర్ టెక్నాలజీ వంటి సాంకేతికతలను బొగ్గు ఉత్పత్తిలో వినియోగిస్తూ ఆదర్శ కంపెనీగా నిలుస్తోందన్నారు. సింగరేణి థర్మల్ ప్లాంట్ లో ఉత్పత్తి అయ్యే బాటమ్ యాష్, ఫ్లై యాస్లను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటూ పర్యావరణానికి దోహదపడుతోందని వివరించారు.